

# విరామం

## – అంగర వెంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్ తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

*విజయవాడ, 24-1-1970*

# విరామం

*(ప్రారంభం)*

పున్నమి రాత్రి. వెన్నెల్లో పద్మావతి మిలమిల మెరుస్తూంది. దూరంగా యిటూ అటూ తీరంమీద చెట్లూ చేమలూ చీకటి ముద్దల్లా వున్నాయి. వాటి వెనక పల్లెల్లో దీపాలు మినుకు

మినుకుమంటున్నాయి.

“గర్ గర్ – డబ డబ” మని శబ్దం చేస్తూ 'లాంచి' నిశ్చింతగా వెళ్ళిపోతూంది.

తల్లిలా ప్రజల్ని పోషించే యీ మెత్తని మనసుగల పద్మ ప్రతి యేడూ విరుచుకుపడి అనేక పల్లెల్నీ, పశువుల్నీ, మనుషుల్ని, ఆస్తుల్ని జాలి నాలి లేకుండా తుడిచి పెడుతుంది. ప్రకృతి చాలా విచిత్రమైంది.

చందమామ మబ్బుల్లో దూరిపోతూన్నప్పుడు, పైకొస్తున్నప్పుడూ, పద్మ మొహంలో హావ భావాలు, రంగులూ మారుతున్నాయి.

లాంచిలో నా బెర్తుకి యెదురుగా ఒక అమ్మాయి పడుకుంది. తెల్లని శరీరం, తెల్లచీర, ఆమె మొహం మీద వెన్నెల పడినప్పుడు తెల్లకలువ పువ్వులా వుంది. ఆమె పేరు పద్మ. లాంచికింద పద్మ జాబిల్లి వెలుగులో మొలక వజ్రాల నవ్వులొలుకుతూంటే, లోపల పద్మ నా కెదురుగా ప్రపంచాన్ని మరిచి నిద్రపోతూంది. ఈ పద్మ వెడల్పైన నుదిటినీ, చెంపకు చారడేసి కళ్ళనీ సన్నగా తీరుగా విల్లులా వంగిన కనుబొమ్మలు వేరుచేస్తున్నాయి.

పద్మకి పెళ్ళి కాలేదు, మరైతే పక్క బెర్తుమీద పడుకున్నదెవడు? అతనాపిల్లకి ఏమౌతాడు? ఏమి కాకపోవచ్చనుకున్నా, పరిగెడుతూన్న పద్మకేసి లాంచి కిటికీలోంచి చూస్తూ.

ఎన్నేళ్ళనించీ పరిగెడుతూందీ పద్మ, ఎండా కాలంలో అమాయకంగా పెళ్ళినడక నడుస్తూ, వానాకాలం రాగానే వురుములతో తన హోరుజత చేస్తూ, మెరుపుల వేగంతో పరుగు పందెం వేస్తూ, గట్లు కోసుకొని వురకలేస్తూ, "కీర్తి నాశ' అనే బిరుదు సంపాదించింది.

పాపం లాంచిలో పద్మ అలాంటిది కాదు. నిద్రపోతూన్న ఆమె మొహం చూస్తే, ఆమె హృదయంలో ప్రశాంతత వుందనిపిస్తోంది...

అంతేకాదు. బాధ్యత వుందని నేనంటే అతనొప్పుకోలేదు. పెదిమలు విరిచి అనంగీకారంగా

తలూపేడు పక్కనున్నతను.

అతనంతవరకూ పల్చటి కండువా కప్పుకు పడుకున్నాడు. అప్పుడే లేచి కూర్చున్నాడు. నేను కిటికీ దగ్గర నిలబడి, బైట పద్మ వెంపు, లోపలి పద్మ వెంపు చూస్తూ వరస పెట్టి సిగరెట్లు కాలుస్తున్నా.

"టైమెంతైంది?'' అతను

"పన్నెండున్నర..." నేను చేతివాచీ చూసి చెప్పా. అతనికో సిగరెట్టిచ్చా. అతను అలా కూచునే శంఖం వూదినట్టు దమ్ము లాగుతున్నాడు. పైలా పచ్చీసులో వున్నాడు. పొడగిరి కాదుగాని బొద్దుగాలేదు. ఆరోగ్యంగా వున్నాడు. చిన్న నల్లగుడ్లు, విశాలమైన తెల్లగుడ్లు, తెల్లగుడ్ల మీద యెఱ్ఱజీరలు.

లాంచి "గుఱ్ఱు గుఱ్ఱు డబ డబ" మని వెళ్ళిపోతూంది.

'నేను ఈ యుద్ధాన్ని ద్వేషిస్తున్నా..." అని దమ్ములాగి యేదో చెప్పబోయి పొలబారి దగ్గేడు.

"నేను మాత్రం ప్రేమిస్తున్నానా?" సిగరెట్టు కొస కిటికీ మీద నొక్కి, నదిలోకి మీటించి అన్నా.

"మరి మీరు మిలిట్రీవాళ్ళలా వున్నారు. ఆ సంగతి మీ దుస్తుల వల్ల తెలీకపోయినా మీ లగేజివల్ల తెలుస్తూంది..."

"ఔను. నేను మిలిట్రీ వాణ్ణే?"

"అయితే మీరు తుక్కు మాట్లాడుతున్నారు..."

"కారణం?"

"మరేమిటి? యుద్ధాన్ని ప్రేమించరట. మిలిట్రీలో పనిచేస్తారు. ఇదిగో ఈ పద్మ కూడా మీలాంటి జడ్డిదే..."

నన్నతను జడ్డివాడన్నా, పద్మలాంటి దానినన్నందుకు సంతోషం వేసింది.

"బాధ్యత మనిషిని మెడవొంచుతుంది. ఇష్టం లేనిపని చేయిస్తుంది. జీవితం అంతా మనం అనుకున్నట్టూ సాగదు."

"అదే తుక్కువాదం, మీరంతా దేశద్రోహులు..." అతను చఱ్ఱునలేచి, ఒక్క అరుపు అరిచేడు. నేను చలించలేదు, పద్మ తుళ్ళిపడి లేచింది.

"కమల్! ఎవరిమీద కేకలు...?క్షమించండి... ఇతనికి ప్రథమ కోపం ఎక్కువ. మరోలా అనుకోకండి. అతని మాట తీరే అంత..." తడబడుతూ నాతో అంది పద్మ.

"నేనేమీ అనుకోవడం లేదు..."

"ఎవరేమనుకున్నా నాకేం భయం లేదు..." కమల్ ముసుగు తన్ని మళ్ళీ పడుకున్నాడు.

"మీ రెక్కడి కెళుతున్నారు...." పద్మ

"అగర్తలా...."

"మీది ఆర్టిలరీవా..."

"కాదు ఆర్టిలరీ వర్కుషాపు. ఐ.ఈ.ఎమ్.ఈ."

"అలాగా..."

"మీకు మిలిటరీ విషయాలు తెలిసినట్టుంది..."

“నేను కలకత్తాలో ఆర్టిలరీ బ్రిగేడ్ హెడ్ క్వార్టర్సులో పనిచేస్తున్నా...”

“నిజం? నాకు మీ ముసిలాణ్ణి తెలుసు. బ్రిగేడియర్ గోల్డెన్. మీరు సివిలియను ఉద్యోగం చేస్తున్నారా?"

“కాదు. నేను “వాకై ని”

నేను ఉద్యోగ రీత్యా అయినా ప్రయాణం మాత్రం సివిలియను దుస్తుల్లోనే, సివిలియన్ రైళ్ళులోనే. లాంచీల్లోనే చేస్తాను. మూడు నాలుగు సార్లు మిలిటరీ రైల్లో ప్రయాణం చేశా. కాని ఆ ప్రయాణానికీ యీ ప్రయాణానికీ యెంతో తేడా. రైలు పరుగెడుతూంటే కనిపించే కొండలూ, చెరువులూ, తోపులూ, పక్షులు, ఆకాశం. అన్నీయెంతో వింతగా తోస్తాయి. హాయిగా వుంటుంది. మామూలు ప్రయాణం. మిలిటరీ స్పెషలులో ప్రయాణం సదుపాయంగా వుంటుంది. కాని అందులో యీ హాయి లేదు. అందుకే కామోసు పద్మ నాలాగే ప్రయాణం చేస్తుంది.

“మీ రెక్కడికెళుతున్నారూ?” అని అడిగాను.

“కొమిల్లా... మా వూరు...

కొమిల్లా... విశాలమైన, అందమైన వూరు. మా వూరు చుట్టూ యెత్తైన గుట్టలున్నాయి. కాని యిప్పుడావూరు ఆలివ్ ఆకుపచ్చలో నిండిపోయింది...” భారంగా అంది.

“మీరెందుకు సర్వీసులో చేరేరు?" ప్రశ్నవేసి నాలిక్కరుచుకున్నా.

లాంచి డబ డబ శబ్దం యెక్కువైంది. చందమామ మబ్బు వెనుక మరుగు పడ్డాడు .

“మీరెందుకు చేరేరు?” ఎదురు ప్రశ్న వేసింది పద్మ.

“ముఖ్యంగా డబ్బుకోసం. తరవాత దేశం నాలుగు మూల్లా చూడొచ్చని. కొంత కాలం సాహస జీవితం గడపొచ్చని కూడా” పద్మ తలొంచుకుంది.

“నాకు దేశం అంతా చూడాల్ని తపనలేదు. కాని పరిస్థితులే ఈ సాహసానికి పురికొల్పేయి. నాకు ఐదుగురు చెల్లెళ్ళు, ఒక తమ్ముడూ వున్నారు. తూర్పు బెంగాలులో పరిస్థితి మీకంతగా తెలిసినట్టు లేదు. మీరీ వెంపు యిదే రావడమా?”

“ఔను...”

“సరే... మీకే తెలుస్తుంది. మా తల్లి గతించింది. మా నాన్నగారు గంపెడు సంసార భారంతో కుంగిపోయేరు. ఆయన కోర్టులో చిన్న గుమస్తా. ఆయన సంపాదనయెందుకూ చాలదు. నాకు సంసార పరిస్థితి బాగా అర్థమైంది. ఉద్యోగంచేసి నేనూ సంపాదించి తీరాలి. ముందటేడు ఇంటరు పూర్తి అవగానే మిలిటరీలో చేరా...”

"మీ వూళ్ళోనే యేదో వుద్యోగం సంపాదించలేక పోయారా?"

"అసంభవం. మా నాన్నగారసలు వుద్యోగమే చెయ్యొద్దన్నారు. ఆయనకది పరువు తక్కువ. కాని నేనెలాగో వొప్పించా, సర్వీసులో చేరిందగ్గర్నుంచీ నెలకి నూర్రూపాయలు పంపుతున్నా యింటికి. అప్పుడప్పుడు అదనంగా కూడా పంపాల్సొస్తుంది."

అప్పుడే మబ్బులోంచి బైటకొచ్చిన చందమామ వెలుగులో పద్మ మొహం మీద విచారం కనిపించింది.

"క్షమించండి, మీకు బాధ కలిగించేను."

"నాకు వాకైల్ని బాగా తెలుసు. కలకత్తాలో మా బ్రిగేడు ఆఫీసులో ఇరవైమందున్నారు బెంగాలీలు, మళయాలీలు. తెల్లతొక్క ఆంగ్లోయిండియన్లు, నేపాలీలు అన్ని ప్రాంతాల వాళ్లూ వున్నారు. వాళ్ళు సాధారణంగా చాలా స్వేచ్ఛగా వుంటారు. ఎలా పడితే అలా మాట్లాడగలరు, ఏ మాట పడితే ఆ మాట సూటిగా తమని గురించైనా విని చిరునవ్వు నవ్వగలరు. ఏ నవ్వు వెనక యెంత అగ్ని జ్వా ల వుందో చెప్పలేం. ఒక స్త్రీని వేలు పెట్టి చూపించడం సుళువు. చెయ్యి అసరాయిచ్చి లేవనెత్తడం కష్టం."

"మీరు శలవుల్లో వెళుతున్నారా?..." అడిగాను

పద్మ ఔనని తలూపింది. నేను మరొక సిగరెట్టు ముట్టించేను.

"ఇతను మీ బంధువా?..."

"కాదు. స్నేహితుడు..."

"బాయ్ ఫ్రెండ్?"

"నో ప్లీజ్..." గాభరా పడింది.

"గాభరా పడకండి. అతనొక బాయ్. మీకు ఫ్రండు. అందుకే అలా అన్నా."

పద్మ కలువపువ్వు వికసించినట్లు నవ్వింది.

"టాలీగంజ్ లో వున్న మా బ్రిగేడు ఆఫీసు చూసేవుంటారు. ఆ భవనం వీళ్ళదే. వీళ్ళకి డార్జిలింగు దగ్గర చిన్న తేయాకుతోట కూడా వుంది. కమల్ తండ్రిపోయి చాలా కాలమైందిట. తల్లి చాలా తెలివైంది. అన్ని వ్యవహారాలు స్వయంగా చూసుకుంటుంది. ఇతను తెగిన గాలిపటంలా తిరుగుతాడు. బొగ్గు బస్సులా అరుస్తూంటాడు."

"అంతేకాదు. త్వరలో మిమ్మల్ని వివాహం ఆడతాడు" అని నేను నవ్వుతూ పంట్లాం జేబులోంచి చాక్లెట్లు తీసి పద్మకిచ్చా. ఆమె అవి అందుకుంది. కాని ఆమెమొహంమీద విచారపు మబ్బువాలింది.

"నేనితన్ని ఎలా వివాహం చేసుకుంటా చెప్పండి."

"ఎందుక్కూడదు?..."

"కమల్ గొప్ప ధనవంతుడు."

"ఓ, అదా! పెళ్ళయ్యాక మీరూ ధనవంతులౌతారు...."

'క్షమించండి. మీకర్థం కాలేదు. నాకింకా ఐదుగురు చెల్లెళ్ళూ, తమ్ముడూ వున్నారు. వాళ్ళ చదువులూ, పెంపకం జరగాలి. మాది ఒక సామాన్య కుటుంబం. మామూలు రోజుల్లో యింట్లో సంగతి బైటకి రాకుండా గడిచిపోయేది. మాకు తూర్పు బెంగాలు ఘోర పరిస్థితి తెలీదు. కొన్నాళ్ళకి తెలుస్తుంది. పశ్చిమ బెంగాలు పరిస్థితి బాగుందని నేననడంలేదు. కాని ఇక్కడి పరిస్థితి చూడాలి. ప్రతి మనిషికీ ఈ విషయాలు తెలియాలి. నేను పెళ్ళి చేసుకుంటే నాకు బాగానే వుంటుంది కాని, నాన్నగారూ, చెల్లెళ్ళు, తమ్ముడు, వాళ్ళేమవుతారు...?"

"వాళ్ళని కలకత్తా తీసుకెళ్ళి పోవచ్చేమో..."

"అసంభవం.." చాలా విసుగ్గా అంది.

తెల్లవారుజాము మూడు కావస్తూంది, గత రోజు మధ్యాహ్నం రెండు గంటలకి లాంచి చాంద్ పూరు రేవు విడిచి పెట్టింది.

"చాంద్ పూర్ చేరేసరికి బాగా తెల్లారిపోతుందా?"

"ఔను. ఐదు గంటలకి చేరుతాం."

"అగర్తలా రైల్వే మ్యాపులో లేదు...."

"అగర్తలాకి రైలు లేదు. మీరు అఖౌరాలో దిగి బస్సుమీద వెళ్ళాలి. మనం కలిసి ఒకే రైల్లో "లక్షమ్" జంక్షన్ వరకు వెళతాం. అక్కడ నేను వేరే రైలెక్కి కొమిల్లా వెడతా, కాని మీరా రైలు మారక్కరలేదు. మరొక ఐదారు గంటల్లో అఖౌరా చేర్తారు. అక్కడ మీదారి మీరు చూసుకోవలసిందే..."

ఆమె చిన్నగా నవ్వింది. నేనూ నవ్వేను.

నేనొక చిన్న కునుకు తీసి లేచి సిగరెట్టు ముట్టించేను. పద్మకూడా లేచి అటూ ఇటూ చూసింది.

తెలతెలవారుతూంది! పద్మ కిరుపక్కలా వున్న చెట్లూ, వూళ్ళూ రూపుదేరుతున్నాయి. గుంపులు గుంపులుగా పక్షులెగురుతున్నాయి. దూరంగా చాంద్ పూర్ "ఘాట్" కనిపిస్తూంది. వుండుండి లాంచి యెద్దులా రంకెవేస్తూంది.

"ఈయన కూడా కొమిల్లా వస్తున్నాడా?"

"లేదు లక్షమ్ వరకూ వస్తాడు, నన్నక్కడ రైలెక్కించి తిరిగి కలకత్తా వెళ్ళిపోతాడు.అంతవరకూ నాకు సాయం. తను రాకపోతే వెళ్ళలేనని..." హేళనగా నవ్వింది.

"పోనీ మీతో తీసుకెళ్ళకూడదూ..."

"అంత సాహసం లేదు..." .

“మగ సాయం లేకుండా ప్రయాణం చెయ్యడానికి భయం లేదు. కాని మగసాయంతో ప్రయాణం చెయ్యడమంటే భయం, విచిత్రంగా వుంది మీ ప్రవృత్తి...” నేను ఛలోక్తి విసిరా.

“మీరు సూదుల్లాంటి మాటలు విసర గలరు...”

‘“క్షమించండి. మీ మనసు నొప్పించాలని వుద్దేశం లేదు. మీరు కమల్ ని ప్రేమించొచ్చు. పెళ్ళాడొచ్చు. ఇందులో దోషమేముంది? అంచేత అతన్ని మీతో యింటికి తీసుకెళ్ళండి. మీ నాన్నగారు సంతోషిస్తారు. అందువల్ల మీ సంసార పరిస్థితి చక్కబడుతుందని నా నమ్మకం...”

ఆమె నావేపు వేడిగా చూసింది.

నేను చిరునవ్వు నవ్వి "అసంభవం” అన్నా.

ఆమె ఫక్కున నవ్వింది.

“నా ఊతపదం పట్టేశారే...”

“చూడండి పద్మా! ఈ యుద్ధం వల్ల మన సహజ పరిస్థితి మారుతుంది. మనం అప్పుడే మొదటి అంచీ చేరుకున్నాం. మధ్య తరగతి కుటుంబానికి చెంది. గడపదాటి బైటకి తొంగి చూడని మీలాంటి స్త్రీలు, మిలిట్రీలో చేరి, దూరప్రాంతాల్లో వుద్యోగం చేస్తున్నారు. లక్షాధికారి కమల్ మిమ్మల్ని ప్రేమించి పెళ్ళి చేసుకోవడానికి సిద్ధంగా వున్నాడు. ప్రపంచపు ప్రాక్పశ్చిమరంగాల్లో యుద్ధం చల్లారేసరికి మన దేశం పోల్చుకోలేనంతగా మారిపోతుంది. మనం ప్రస్తుతం పాతరైలు దిగిపోయేం. కొత్త రైలింకా ఎక్కలేకపోతున్నాం. మధ్య వూగిస లాడుతున్నాం...”

“మీ భవిష్యత్ పురాణం కాస్త ఆపండి. అదిగో చాంద్ పూర్ ఘాట్. ఇక ఈ కుంభకర్ణుణ్ణి లేపాలి... కమల్! ఇక నిద్ర చాలించు. లే అదిగో చాంద్ పూర్...” అతని నడ్డిమీద రెండు చరిచింది.

కమల్ లేచి ఆవలించి వొళ్ళు విరుచుకున్నాడు.

ఘాట్ మీద మంచి హడావిడిగా ఉంది. లాంచి నిశ్శబ్దంగా నిదానంగా జెట్టీ చేరుతూంటే జెట్టీయే లాంచివేపు కదుల్తూన్నట్టుంది. ఒంటి నిండా ఆవనూనె పూసుకున్న కుర్రకుంకలు దిస మొలలో జెట్టీమీంచి నది నీళ్ళలోకి టప్పుటప్పున దూకి, చేపల్లా తప్పుతప్పున యెగిరిపడుతూ, కిచ కిచ నవ్వుతూ పాటలు పాడుతున్నారు.

మేం లాంచి దిగేం. కొంచెం మబ్బుగా వుంది. వర్షం వచ్చేస్తుంది. ఎనిమిది గంటలగ్గాని రైలు రాదు. మిలిటరీ రైళ్ళు వస్తున్నాయి, పోతున్నాయి. అక్కడ వేలాది మిలిట్రీవాళ్లున్నారు. అంతా కలిసి ఒక ఆలివు ఆకుపచ్చ సముద్రంలా వున్నారు. నేనూ వాళ్ళలో వాణ్ణే.

మేం మొహాలు, చేతులూ కడుక్కున్నాం. అక్కడ పాకల్లో కొన్ని సివిలియను కాంటీనులున్నాయి. అవి దరిద్రం వోడుతున్నాయి. వాటి యజమానులు మరీ దరిద్రంగా వున్నారు. ఆ పాకల్లో వడ్డించేవాళ్లు, తినేవాళ్ళు కూడ దరిద్రంగానే

వున్నారు. ఇన్ని దరిద్రాలకి భూషణంగా అక్కడ లెక్క లేనన్ని యీగలున్నాయి. అక్కడివాళ్ళు మాట్లాడుతూన్న భాషలో ఒక ముక్క కూడా నాకు బోధపళ్ళేదు. నేనొక పాకలో దూరి ముక్కు మూసుగుని బైటకొచ్చా.

పద్మ నవ్వుతూ అంది. "చూశారా! తూర్పు బెంగాల్లో అడుగు పెట్టగానే మీకెలాంటి దృశ్యం ప్రత్యక్షమైందో! భయపడకండి. ముందింకా మరీ ముచ్చటగా వుంటుంది."

ఇంతలో కమల్ కొన్ని పూరీలూ, తియ్య గుమ్మడి కాయ కూరా తెచ్చేడు. పూరీలు యెండిపోయి తోళ్ళలా వున్నాయి. కూర కంపు కొడుతూంది. అవి తింటే వాంతి తప్పదు. నేనాలోచించా.

పద్మని, కమల్ ని అవి తినొద్దన్నా. యూనిఫారం వేసుకుని మిలిటరీ రిసెప్షను కాంపు దగ్గరి కెళ్ళా, అక్కడే ఒక సిఖ్ఖు సుబేదారు సాబ్ అగుపించేడు. అతనికి సెల్యూట్ చేసేను.

అతను నన్నెగాదిగా చూసేడు.

"నువ్వొంటరిగా యెందుకు ప్రయాణం చేస్తున్నావు. నీ దగ్గర మూమెంటార్డరుందా?" గర్జించేడు.

"ఒంటరిగా ప్రయాణం చెయ్యడం లేదు సాబ్. మూమెంటార్డరుంది. నాకూడా ఒక స్త్రీవుంది."

"నీ బీబీయా?"

"కాదు. వాళ్ళది కొమిల్లా. వాళ్ళ తాతగారు కలకత్తాలో వున్నారు. ఆయన నా స్నేహితుడు. నే నగర్తలా వెళుతున్నానంటే ఆపిల్లని వాళ్ళ వూరు దిగబెట్టమని బతిమాలేడు. సరే అన్నా. అదీ సంగతి... కాస్త టీ...".

"అలాగా! అరే, లల్లూరామ్ కీ బచ్చే" సుబేదార్ సాబ్ రంకెవేసేడు.

"ఆయా హుజూర్!" లల్లూరామ్ లంగరీ (వంటవాడు) వచ్చేడు.

"చూడు. ఈ సాబ్ కి చాయ్, చపాతీ ఇయ్యి."

"జీ హుజూర్. ఎన్నివ్వమన్నారు?"

"ఒరే మట్టిబుర్రా! అదీ ఒక ప్రశ్నే?"

"అచ్చా హుజూర్! ఇదిగో యిస్తున్నా" లంగరీ పరుగెత్తేడు. ఐదు నిమిషాల్లో పది పన్నెండు చపాతీలు, చాయ్ తీసుకొచ్చేడు. నేను సుబేదార్ సాబ్ కి "బహుత్ మెహర్బానీ" చెప్పి సలాం చేసి బైల్దేరా.

నేను, పద్మ, కమల్ చపాతీలు తిని, టీ తాగేం.

ఎనిమిది గంటలకి రైలొచ్చింది. వచ్చిన రైలే తిరిగి వెళుతుంది. అది తూర్పు బెంగాలు సరిహద్దు, పశ్చిమ బెంగాలు వెళ్ళాలంటే పద్మా నది దాటాలి. మేం యిప్పుడొచ్చినట్టే.

అక్కడ రైలు ప్రయాణం వొక సాహసమే. ప్లాటుఫారం మీద కొన్ని వేల మంది ప్రయాణీకులున్నారు. వాళ్ళకోసం అమ్మే తినుబడి పదార్థాలు జంతువులు కూడా తినవు, కాని మనుషులు వాటినే యెగబడి తింటున్నారు. రైలు పెట్టెల్లో నొక్కుకుంటూ, తొక్కుకుంటూ, తోసుకుంటూ, తిట్టుకుంటూ కూరుకు పోతున్నారు.

కోతుల్లా రైలు పెట్టెల మీదికెగబాకి టాపుల మీద కూచున్నారు కొందరు. ద్వారబంధాల్ని, గజాన్ని పట్టుకు ములక్కాడల్లా వేళ్లాడుతున్నారు మరికొందరు. వాళ్ళమాటలు నాకు ఆవపాటి కూడా అర్థం కావు. వాళ్ళంతా జైలు తలుపులు పగలగొట్టి, గోడలు గెంతి పరిగెత్తుకొచ్చిన ఖైదీల్లా, పిచ్చాస్పత్రి నుంచి తప్పించు కొచ్చిన పిచ్చివాళ్ళలా వున్నారు.

దీనికి తోడు అంతకుముందు పట్టిన మబ్బు మరీ కారుకమ్మి వర్షం ఆరంభించింది. అయినా ములక్కాడల్లా వేళ్లాడుతున్నవాళ్ళు, టాపుల మీద కోతుల్లా కూచున్నవాళ్ళు చలించలేదు. రైలు అధికార్లు వాళ్ళని దిగమనలేదు. హోరుమనే వానలో, మొయ్యలేని బరువుతో మొర్రో మంటూ రైలు బైల్దేరింది. మేం రెండో తరగతి పెట్టెలో కొంచెం పరవాలేదన్నట్లే కూచున్నాం.

రైలాగినప్పుడల్లా తిరిగి పిచ్చాస్పత్రి తయారవుతూంది. “చూశారా, ప్రయాణం యెలా వుందో మా దేశంలో” అంది పద్మ.

“ఆశ్చర్యం లేదు పద్మా. ఇది యుద్ధ రంగం. యుద్ధ రంగంలో పరిస్థితు లొక్కొక్కప్పుడు యింతకన్నా అధ్వాన్నంగా వుంటాయి. మనలాంటి సామాన్య సంసార్లకిది యేమంత యిబ్బందికాదు. ఇదిగో, కమల్ వంటి వాళ్ళకే యిబ్బంది.”

“తుక్కూ తుక్కూ, నేను రెండు సార్లు పుట్టలేదు పైగా నాకా ఆస్తి అక్కర్లేదు. కారణం” అని, యింకా ఏమో అనబోయి సిగరెట్టు పొగవల్ల పొలబారి దగ్గేడు కమల్.

“చూడండి, డబ్బులేని వాళ్ళు లేదని బాధపడుతూంటే, ఉన్నవాళ్ళు వద్దో అని అఘోరిస్తున్నారు” పద్మ చిరునవ్వుతో కమల్ వేపు సైగ చేస్తూ అంది.

"నిజమే. కాని ధనం వచ్చే మార్గం కనిపిస్తూన్నా, దాన్ని అనుసరించని వాళ్ళుకూడా వుంటారు” నేను చిరునవ్వుతో అన్నా.

పద్మ మొహం ముడుచుకుంది.

నిజానికి పద్మ కమల్ యింటికి వెళుతుంది. కమల్ తల్లి ఆమెని కూతుర్లా చూస్తుంది. తనకి కోడలు కమ్మని చాలాసార్లడిగింది. కాని పద్మ ఏ సమాధానం చెప్పలేదు. పద్మ తనకి కోడలైతే కొడుకు విహంగ జీవితానికో స్థిరత్వం కుదురుతుందని ఆమె ఆశ.

టాలీగంజ్ లో వాళ్ళ భవనం కింద అంతస్తులో ఆర్టిలరీ బ్రిగేడు ఆఫీసుంది. పై భాగంలో తల్లీ కొడుకులుంటున్నారు. పెద్ద వరండాలు, విశాలమైన గదులు, ఆధునిక గృహోపకరణాలతో భవనం చాలా బాగుంటుంది.

ఇంటివాళ్ళు కాక మరో యిద్దరు పనివాళ్ళు తప్పితే మరెవ్వరూ లేరు. కమల్ త్రిపాది నక్షత్రంలా తిరుగుతుంటాడు. లింగు లింగు మంటూ తల్లి ఒక్కతే అక్కడ మెసుల్తూంటుంది.

అయితే కమల్ తల్లిది మంచి ఆరోగ్యం . చురుకుతనం, తెలివీ వున్నాయి, వయస్సు నలభై ఐదైనా, పదేళ్ళు చిన్నదిలా వుంటుంది. బ్రిగేడ్ ఆఫీసులో ఆఫీసర్లుమొదలు సిబ్బంది అందరికీ రోజుకి రెండుసార్లు "టీ" సప్లయి చేస్తుంది, సప్లయి చేసిన టీకి నెల నెలా బిల్లు చేస్తుంది. అడపా తడపా పని సమయంలో ఆఫీసు అన్ని గదుల్లోకి వెళ్ళి పేరు పేర్నా అందర్నీ పలకరించి టీ యెలావుందో కనుక్కుంటుంది. "ఓల్డ్ మాన్" బ్రిగేడియర్ గోల్డెన్ గదిలో దూరి, రెండు నిమిషాలు కబుర్లాడి వెళ్ళిపోతుంది.

మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగింది పద్మ. సామాజిక దౌర్బల్యాలొక వంక, అతిశయం మరొకవంక లాగుతుంటే, వాటి మధ్య సతమతమయ్యే మధ్య తరగతికి చెందిన వాళ్ళకి పెద్ద పెద్ద భవనాలు కిట్టవు. ధనవంతులతో చేతులు కలిపితే వాళ్ళ అభిమానం దెబ్బతింటుందేమో అని భయపడతారు. అది ఒక విచిత్రమైన మానసిక ప్రవృత్తి.

పద్మ తరచు కమల్ యింటికి వచ్చేది. భోంచేసేది. కమల్ తో సినిమాలకి, విహారాలకి వెళ్ళేది. ఈ జంట కలిసి తిరుగుతూందని అందరికీ తెలుసు. ఎప్పుడైనా కమల్ తల్లి ఆఫీసులో కొస్తూంటే మిగిలిన స్టాఫ్ వాళ్ళు “మిస్ పద్మా! మీ అత్తగారొస్తూంది” అని యెగతాళి చేసేవాళ్ళు. కాని పద్మ తను కమల్ ని వివాహం చేసుకుంటానని ఏ నిముషానా అనుకోలేదు.

రైలు ముందుకి పరిగెడుతూన్నకొద్దీ, వర్షం జోరెక్కుతూంది. ఆకాశం నల్లగా పొంగిన సముద్రంలా వుంది. కారు నల్లని మేఘాలు రకరకాల చూపులు మారుతూ నాలుగు మూలలకీ జోరుగా దొర్లుకు పోతున్నాయి. అంతా జలార్ణవంలా వుంది. అంతులేని ఆకాశపు లోతుల్లోంచి నిర్విరామంగా ఉరుములు వానమోతని చీల్చుకుని, ప్రకృతి వణికేలా దీర్ఘంగా గర్జిస్తున్నాయి. కత్తుల్లా అనేక మెరుపులు తళుక్ తళుక్ మంటున్నాయి.

“ఈ మూడువారాల్లో యెప్పుడైనా కొమిల్లా వస్తే మా యింటికి తప్పకుండా రండి...” పద్మ నాతో అంది.

“అలాగే....”

“మీకు మాయిల్లెలా తెలుస్తుంది?”

“ఎడ్రసు చెప్పండి...”

"నే చెప్తా రాసుకోండి” కమల్.

“నీకు తెలీదు” పద్మ అతనివేపు తీక్షణంగా చూసి అంది.

“తుక్కూ తుక్కూ... చూశారా యెలా టకాయిస్తుందో, నాకు తన ఎడ్రసు తెలీదట.”

“మీరెప్పుడైనా కొమిల్లా వెళ్ళేరా?” అని అడిగాను.

“వెళ్ళలేదనుకోండి. కాని పద్మ కిందటిమాటు సెలవల్లో యింటికెళ్ళినప్పుడు ఆమెకి చాలా...”

“నువ్వు నోరు మూసుకో, అతని మాటలు నమ్మకండి. అతను వట్టి పిచ్చివాడు.”అంది పద్మ.

కమల్ నావేపు కొంటెగా చూసి కన్ను గీటేడు.

"పికాడిల్లీకి తూర్పున లాల్ దిఘీ (ఎర్రచెరువు) వుంది. అక్కడ ఒక్క యింటికే వీధి వెంపు కొబ్బరి చెట్టుంది. అదే మా యిల్లు. ఈ మూడు వారాల్లో ఓ మాటు మా యింటికి రండి”.

"చూశారా స్త్రీ బుద్ధి! అనుకోకుండా కొన్ని గంటల్లో స్నేహం కుదిరిన మిమ్మల్ని యింటికాహ్వానిస్తూంది. ఏళ్ళతరబడి కాళ్ళా వేళ్ళాపడి వెనక తిరుగుతూన్న నన్ను మాటవరసకైనా రమ్మనదు...” కమల్ ఎకసెక్కంగా అన్నాడు.

“ఆశ్చర్యం లేదు. మీరెప్పుడూ ఆమె దగ్గరే వుంటారు. ఆమె మనసులోనే వుంటారు. మీకు మళ్ళీ వేరే ఆహ్వాన మెందుకూ? బైటవాళ్ళకే ఆహ్వానం” అన్నాను.

“నేను బైటవాణ్ణైనా అయేనుకాను, ఆహ్వానం వచ్చి వుందును...” అన్నాడు కమల్.

ఇద్దరం నవ్వేం. పద్మ కూడా నవ్వింది.

లక్షమ్ జంక్షను వచ్చింది. వాన తగ్గలేదు. హోరని కురుస్తుంది. వానలోనే పద్మ సామాన్లు దింపి ప్లాట్ ఫారం మీద వేసేం. రైలు కూసింది. కమల్ నాతో కరచాలనం చేసేడు. పద్మ నావేపు జాలిగా చూచింది. నేను గబగబా రైలెక్కి గేటు దగ్గర నిలబడ్డా. రైలు కదులుతూంటే నేను చెయ్యి వూపా. కమల్ విశాలంగా నవ్వుతూ జోరుగాపడుతూన్న వానలో చెయ్యూపేడు. పద్మ చెయ్యి నిమ్మళంగా కదిపింది. నిదానంగా, జోరుగా పడుతూన్న వానలో చెయ్యూపుతున్న పద్మ మెరుపులా తోచింది. ఆమె హృదయంలో వురుము కూడా వినిపించినట్లైంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments